ప్రజాశక్తి
శనివారం 13 మే 2023

డెంగీ నియంత్రణకు చర్యలు

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో డెంగీ వ్యాధిని కట్టడి చేసేందుకు ముందస్తు ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ శాఖ, వైద్య శాఖ అధికారులతో జిల్లా స్థాయి కీటక జనిత వ్యాధుల నివారణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ దోమలు వద్ధి చెందే ప్రాంతాలపై అధికారులు దష్టి సారించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నీరు నిలిచినప్పుడు మలేరియా దోమలు వద్ధి చెందితే, కప్పి ఉంచిన నీళ్లలో డెంగీ దోమ ఎక్కువగా వద్ధి చెందుతుందన్నారు. పూర్తిగా పగల గొట్టని కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నిలిచిన నీళ్లు, మూసిఉన్న డ్రైనేజీ కాల్వలలో డెంగీ దోమలు వద్ధి చెందుతాయన్నారు. ఈ విషయంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని, ఎప్పటికప్పుడు మురికాల్వలను పరిశుభ్ర పరుస్తూ పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహించాలని అధికారులను అదేశించారు. డెంగీ కేసులు కనిపించిన గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డెంగీ ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ యాక్షన్ ప్లాన్ అమలతో పాటు మున్సిపాలిటీల్లో చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిషనర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, మునిసిపల్ ఆర్డీ పీవీఎస్ఎస్ మూర్తి, డీఎంహెచ్‌వో వీరబ్బాయి, డీపీవో ప్రభాకర రావు, నగర మునిసిపల్ కమిషనర్ రమణా రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజ రావు పాల్గొన్నారు.

'పది' విద్యార్థికి ప్రశంసాపత్రం

జిల్లా బీసీ సంక్షేమ హాస్టళ్ల పరిధిలో పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ఏ.నవ్యకు కలెక్టర్ ఎమ్.గౌతమి శుక్రవారం ఉదయం ప్రశంసా పత్రాన్ని అందించారు. బుక్కరాయసముద్రం బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ బుక్కరాయ సముద్రం జెడ్పీ హై స్కూల్ లో పదవ తరగతి పూర్తి చేసి నవ్య పది అత్యుత్తమ మార్కులు సాధించింది. ఈ విద్యార్థితో పాటు 500కి పైగా మార్కులు సాధించిన 22 మందికి బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంశా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖుష్బు కొఠారి పాల్గొన్నారు.

వైసిపిలో అసంతృప్తి జ్వాలలు



- ఇన్‌ఛార్జి మంత్రి పెద్దారెడ్డి ముందు పంచాయితీ
- వీరుంటే వచ్చే ఎన్నికల్లో మన పరిస్థితి అంతే...
- ఎమ్మెల్యేలపై నేతల అసంతృప్తి
- రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపిలో నెలకొన్న అసంతృప్త జ్వాలలను చల్లార్చేందుకు ఆ పార్టీ అధిష్టానం దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నార్పల పర్యటనకు వచ్చిన సందర్భంలో కొంతమంది నాయకులు ఎమ్మెల్యేల పనితీరుపై ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రంగంలోకి దిగారు. నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రోజుకు మూడు నియోజకవర్గాలు సమీక్ష జరుపుతున్నారు. శుక్రవారం నాడు దీన్ని ప్రారంభించారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని నారాయణపురం గ్రామం పంచాయతీ పరిధిలోని ఒక ప్రయివేటు రిసార్ట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. మొదటి రోజున రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ మూడు నియోజకవర్గాల నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాల్లో ముందుగా రాయదుర్గం నియోజకవర్గం సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డితోపాటు నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యే, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టుగోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శిల్ప, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఉపేంద్రారెడ్డి, మాజీ ఎంపిపి రాజగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు రాజేంద్రనాథరెడ్డి, తిమ్మప్ప, ఉష, జయరాంరెడ్డి, కేశవరెడ్డి తదితర ముఖ్య నేతలందరినీ పిలిచారు. నేతలతో విడివిడిగా మాట్లాడారు. ఇందులో ఎమ్మెల్యే పనితీరుపై కొంత మంది నేతలు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు సమాచారం. పార్టీ ఆరంభం నుంచి పనిచేస్తున్న తమకు తగిన ప్రాధాన్యత కల్పించడం లేదన్న అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఏదైనా ప్రశ్నిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలువడం కష్టమేనని తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో గెలుపోటములపై పందేలు సైతం కాస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాడిపత్రి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నాయకులు విఆర్.రామిరెడ్డి, పేరం నాగిరెడ్డి, పేరం స్వర్ణలత, రమేష్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, కాకర్ల రంగనాథ్, ఫయాజ్ బాషా తదితరులు సమీక్షకు హాజరైన వారిలోనున్నారు. ఈ నియోజకవర్గం రివ్యూలోనూ ఇదే తరహాలో గ్రూపుల వారీగా ఆరోపణలు, ప్రత్యారోపణలు జరిగాయి. తమకు తగిన ప్రాధానత్య లభించడం లేదని, అందరినీ సమన్వయం చేసుకోనిపోవడం లేదని మంత్రికి విన్నవించారు. చివరగా ఉరవకొండ నియోజకవర్గం సమీక్ష జరిగింది. దీనికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జడ్పిటిసి, ఎంపిపిలు పాల్గొన్నారు. గ్రూపుల వారీగా సమీక్ష జరిగే ప్రాంతంలో బలప్రదర్శనలాగా జనం చేరుకున్నారు. సుమారు వెయ్యి మంది వరకు మూడు గ్రూపులుగా నేతలు తరలివచ్చారు. ఈ సమీక్షలోనూ ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఈ సమీక్షల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందరి నేతలకు సమన్వయంతో నడుచుకోవాలని సూచించినట్టు సమాచారం. ఈ పార్టీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఆయన్ను మరోమారు ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరముందని చెప్పినట్టు తెలుస్తోంది. తేడాలొస్తే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎవరినీ ఉపేక్షించరని హెచ్చరినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు కూడా అందరు నేతలతో సమన్వయం చేసుకుని వెళ్లాలని హితవు చెప్పినట్టు సమాచారం. కింది స్థాయి నేతలతో గ్యాప్ లేకుండా చూసుకోవాలని సూచించారు.

జెఎన్‌టియు బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు విసి

అనంతపురం జెఎన్‌టియు బీ.ఫార్మసీ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి జి.రంగజనార్ధన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన బీ.ఫార్మసీ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్ పరీక్షలకు 2,320 మంది హాజరవ్వగా, 1,829 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దాదాపు 78.84 శాతం పాసయ్యారని తెలిపారు. ఇందులో బాలురు 927 మంది హాజరవ్వగా 607 మంది, బాలికలు 1,393 మంది హాజరవ్వగా 1,222 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్ష ఫలితాలకు సంబంధిత రీకౌంటింగ్, ఫొటో కాపీ, ఛాలెంజ్ వాల్యుయేషన్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెప్పారు. శనివారం నుంచి వీటికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీ ఫార్మసీ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సప్లిమెంటరీ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు ఎం.ఫార్మసీ మొదటి సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.ఫార్మాసీ మొదటి సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ, ఎం.ఫార్మాసీ రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ పలితాలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ వి.సుమలత, పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవ రెడ్డి , కంట్రోలర్ బి.చంద్ర మోహన్ రెడ్డి, అడిషినల్ కంట్రోలర్స్ డాక్టర్ యం.రామశేఖర రెడ్డి, కె.జయలక్ష్మి, జితేంద్ర గౌడ్, డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ రిజిస్ట్రార్లు ఎన్.మధుసూధన రెడ్డి, ఎస్.రంగానాయక్ పాల్గొన్నారు.

దళిత సర్పంచిపై దాడి

ప్రజాశక్తి-నార్పల

దాడిలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న సర్పంచి రామాంజినేయులు

ఎస్సీ రిజర్వు అయిన శింగనమల నియోజకర్గంలో ఓ దళిత సర్పంచిపై శుక్రవారం నాడు దాడి జరిగింది. సర్పంచిని విచక్షణా రహితంగా కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి బాధిత సర్పంచి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... శింగనమల నియోజకవర్గం నార్పల మండలం సిద్ధిరాచర్ల గ్రామపంచాయతీ సర్పంచిగా రామాంజనేయులు ఉన్నారు. ఈ పంచాయతీ పరిధిలో దుర్గం గ్రామం ఉంది. ఈ గ్రామంలో రత్నమ్మ అనే మహిళ ఇళ్లు నిర్మిస్తోంది. ఈ మహిళ ఇంటి మెట్లు రోడ్డులోకి రావడంతో కొద్దికాలంతో క్రితం పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డితో కలిసి సర్పంచి వెళ్లి ఆ మహిళతో మాట్లాడారు. ఇంటి నిర్మాణం రోడ్డులోకి రావడం వల్ల భవిష్యత్తులో మురుగుకాలువలు, రోడ్లు వేసేప్పుడు ఇబ్బంది అవుతుందని సర్పంచి తెలిపారు. అయినా ఇంటి నిర్మాణ పనులు అలాగే కొనసాగాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం దుర్గం గ్రామంలో సర్పంచి రామాంజినేయులు రత్నమ్మ ఇంటి వద్ద వెళ్తుండగా ఆమె కుటుంబ సభ్యులు ఘర్షణకు దిగారు. అక్కడి నుంచి సర్పంచి వెళ్లిపోయాడు. అంతటితో ఆగని రత్నమ్మ ఆమె కుమారుడు వినోద్ సర్పంచి ఇంటి వద్దకెళ్లి మళ్లీ ఘర్షణ పడి, భౌతికదాడి చేశారు. ఈ దాడిలో సర్పంచి రామాంజినేయులు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దళిత సర్పంచి రామాంజినేయులుపై దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, రామాంజినేయులు తీవ్రంగా ఖండించారు. ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలోనే ఇలా దళిత ప్రజాప్రతినిధులపై దాడులు జరగడం విచారకరం అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పంట నష్టపోయిన రైతులందరికీ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

15న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా - సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్లలో అధిక, అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి వల్ల వేరుశనగ, కంది, పత్తి, మిరప, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు అధికంగా రావడంతో పొలాల్లోనే వేరుశనగ, ఇతర పంటలు మొలకలు వచ్చి కుళ్లిపోయాయని తెలిపారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో చేసిన అప్పులు చెల్లించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఐదునెలల్లో 21 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పంట పెట్టుబడులకు అప్పులు పుట్టే పరిస్థితి లేకపోవడంతో ప్రయివేట్ వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు రైతులను దోచుకుంటున్నారని వాపోయారు. కావున గత ఖరీఫ్, రబీలలో అకాల వర్షాలు, వండగండ్ల వానలతో నష్టపోయిన వేరుశనగ, పత్తి, కంది, మిరప, మొక్కజొన్న, అరటి, చీనీ, తమలపాకులు, టమోటా, బొప్పాయి తదితర పంటలకు పంట నష్టపరిహారం, పంట పెట్టుబడి సహాయం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు వద్ద కనీస సౌకర్యాలు టెంట్లు, మెడికల్ కిట్, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పాత పద్ధతుల్లోనే పనులు కల్పించాలన్నారు. పే స్లిప్పులు ఇవ్వాలని, మేట్లకు పారితోషికం ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 15న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నాలకు రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, వి.సావిత్రి, జిల్లా కమిటి సభ్యులు ఎం.క్రిష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, భాస్కర్, నాగమణి, నిర్మల, అచ్యుత్, సూర్యచంద్రయాదవ్, ముస్కిన్, వెంకటనారాయణ, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రామక్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆదర్శనీయుడు గుత్తి రామకృష్ణ

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి

అనంతపురం కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధుడు గుత్తి రామకృష్ణ సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయంగా నిలిచాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. గుత్తి రామక్రిష్ణ వర్థంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం ద్వారా సమాజానికి చైతన్యం నింపిన గొప్ప వ్యక్తి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడి సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనల్లో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారని, రామక్రిష్ణకు ఒక కన్నుకు దెబ్బ తగిలిందని గుర్తు చేశారు. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య జిల్లాలో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు పార్టీ మొట్ట మొదటి కమిటీ సభ్యుల్లో గుత్తి రామక్రిష్ణ ఒకరన్నారు. అలాగే జిల్లాలో గ్రంథాలయాల స్థాపన కోసం, సాహిత్యాన్ని ప్రజల్లో చైతన్యం కలిగించడం కోసం సొంతంగా ప్రెస్ నిర్వహించారని, అనంతపురం నగరంలో కృష్ణా బుక్‌స్టాల్ నడిపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, క్రిష్ణమూర్తి, నాగమణి, ముస్కిన్, సూర్యచంద్రయాదవ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

బేలోడు గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

బేలోడు బాధిత కుటుంబానికి రూ.5లక్షలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామంలో కలుషిత నీరు తాగి అతిసార వ్యాధి బారిన పడి వైద్యం తీసుకుంటూ మృతిచెందిన మరియమ్మ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం బృందం శుక్రవారం గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసారి వ్యాధి బారినపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాజకీయ కక్ష సాధింపులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం మంచిది కాదన్నారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుధ్యం పడకేసిందన్నారు. రోడ్లపైనే మురికి నీరు నిల్వ ఉంటోందన్నారు. ఫలితంగా ప్రజలు నిత్యం అనారోగ్యాన బారిన పడుతున్నారన్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ట్యాంకును కనీసం రెండు నెలలకు ఒకసారైనా శుభ్రం చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీ నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందన్నారు. తక్షణమే పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలను తీసుకోవాలని, కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'గురుకులం' ఫలితాల్లో నార్పల విద్యార్థినికి మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-నార్పల

జాహ్నవి

అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో నార్పలకు చెందిన పర్వత జాహ్నవి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. నార్పలలోని కొండవంక సమీపంలో నివాసం ఉంటున్న పర్వత నాగేంద్ర, నాగేంద్రమ్మ కుమార్తె జాహ్నవి మండల కేంద్రంలోని షిర్డీసాయి విద్యాలయం (ఆనంద్ స్కూల్)లో 4వ తరగతి చదువుతోంది. దీంతో పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ పర్యవేక్షణలో గురుకులం ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకుంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో జాహ్నవీ 50కి 50 మార్కులు ఉతీర్ణత సాధించి మొదటి ర్యాంకు సాధించింది. జాహ్నవి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల నిర్వాహకులు ఆనంద్, ఉపాధ్యాయుల బృందం రాజేశ్వరి, ప్రణయ, తషిన్, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేయాలి

ఎంపిపి దాసరి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

రైతులకు నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేయాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలానికి కె6 రకం 2300 క్వింటాళ్లు, కె-1812 (లేపాక్షి)50 క్వింటాళ్లు కేటాయించినట్లు తెపారు. వీటి ధర రూ.9300 కాగా 40శాతం సబ్సిడీ పోతే రైతు రూ.5580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతుకూ గరిష్టంగా మూడు బ్యాగులు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో విత్తన కాయలను నిల్వ చేయనున్నట్లు తెలిపారు. కావున రైతు భరోసా సిబ్బంది ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను కలుపుకుని విత్తనకాయల నాణ్యతను పరిశీలించిన తర్వాతే రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఎడిఎ వెంకటరాముడు మాట్లాడుతూ సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విత్తనకాయలతోపాటు పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీతో సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇకపోతే డ్రోన్ స్ప్రేయర్లకు సంబంధించి వ్యవసాయ డిప్లొమా విద్య, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు పైలట్ శిక్షణ గుంటూరు లాం ఫారంలో ఇప్పించి పాసుపోర్టు కూడా అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో ఇవ్వాలని కోరారు. పశుసంవర్ధక శాఖ ఎడిఎ రత్నకుమార్ మాట్లాడుతూ మొబైల్ అంబులెన్సు 1962 సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. మార్కుఫెడ్ మేనేజర్ పిన్నేశ్వరి మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులను సరఫరా చేస్తామన్నారు. అలాగే మద్దతు ధర రూ.1,962తో మొక్కజొన్న పంటను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎఒ హరిత, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎఇ ప్రతాప్, రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ఎస్ఆర్ కళాశాలలో ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారన్న సమాచారంతో విద్యార్థి సంఘాలు చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం అడ్మిషన్లు, పుస్తకాల విక్రయాలను అడ్డుకున్నారు. అడ్మిషన్ పత్రాలు, ప్రచార పత్రాలను కళాశాల ఆవరణంలో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుల్లాయిస్వామి, జి. చిరంజీవి, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృధ్వీ, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బిసి.సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

జీవో-1 రద్దు హర్షణీయం : సిపిఎం

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజలకు మద్దతుగా వామపక్షాలతోపాటు ప్రతిపక్ష పార్టీలను ఆందోళనలను అడ్డుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-1ను వెంటనే ఉపసంహరించుకోవాలని హైకోర్టు తీర్పు వెలువరించడం హర్షణీయమని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేవిధంగా ఉన్న జీవోను రద్దు చేయాలనడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో సభలు, రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించడం మానవ కనీస హక్కు అన్నారు. అలాంటి హక్కులను కూడా సిఎం జగన్ కాలరాయాలనుకోవడం బాధాకరమన్నారు. న్యాయ వ్యవస్థలు ఇలాంటి జీవోలను తప్పుపడుతూనే జీవో-1ను హైకోర్టు రద్దు చేయడం శుభ పరిణామమన్నారు.

కళ్యాణదుర్గం : జీఓ-1ను వెంటనే ఉపసంహరించుకోవాలని హైకోర్టు ఆదేశించడం హర్షణీయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో రోడ్‌షోలు, సభలను నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం జీఓ-1ను తీసుకురావడం బాధాకరమన్నారు. ప్రజాసమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయకుండా రాజకీయ పార్టీలు, కార్మిక సఘాలు, ప్రజా సంఘాలను నిరంకుశంగా అణచివేలయాని వైసిపి ప్రభుత్వం చూసిందన్నారు. ఈనేపథ్యంలో హైకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ఉండాలని సూచించారు.

శింగనమల : ప్రతిపక్షాలను అడ్డుకునేందుకు జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవో-1ను రద్దు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా రాష్ట్రంలో సభలు, రోడ్‌షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-1ను తీసుకొచ్చిందన్నారు. ఫలితంగా ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తోందని భావించి వెంటనే జీవోను రద్దు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం ప్రభుత్వానికి చెంప పెట్టు అన్నారు.

ముగిసిన పెన్నోబిలం బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

కోలాహలంగా వసంతోత్సవం

వసంతోత్సవానికి శ్రీవారిని తీసుకెళ్తున్న భక్తులు

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం చక్రస్నానం వైభవంగా ముగిశాయి. ముందుగా తెల్లవారుజాము నుంచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఉద్భవ లక్ష్మీ అమ్మవారి ముఖ మండపానికి తీసుకొచ్చి ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు బాలాజీస్వామి, గుండురావు స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి, సుదర్శన చక్రానికి పసుపు, కుంకుమ కలిపిన పవిత్రజలంతో చక్రస్నానం చేయించారు. అనంతరం భక్తసమూహం నడుమ పవిత్ర జలాలను జల్లి వసంతోత్సవం నిర్వహించారు. ఈ భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

విద్యార్థులకు కథలు చెబుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు వీరారెడ్డి

తాడిపత్రి : పుస్తక పఠనంతో విద్యార్థుల్లో భాషపై పట్టుతోపాటు విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారి రవికుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు ఎన్.వీరారెడ్డి తెలిపారు. సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు శుక్రవారం కథలు చెప్పించడం, డ్రాయింగ్ వేయించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు.

లింగనిర్ధారణ నేరం

ఆత్మకూరు : లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, చేస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని పలువురు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలో తలపూరు ఆరోగ్య ఉపకేంద్రంలో లింగ నిర్ధారణ చట్టంపై అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణపై అవగాహన కల్పించడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య పౌష్టికాహార కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టం ప్రకారం గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకుని గర్భిణులు, ఇతరులతో చర్చించి ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఓబులేసు, ఇఒఆర్‌డి సత్యబాబు, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, పిహెచ్ ఎన్.తులసమ్మ, పంచాయతీ సెక్రటరీ మహబూబ్ జాన్, విఆర్‌ఒ స్వర్ణలత, మహిళా పోలీస్ వీనీల రేఖ, ఎఎన్ఎం లక్ష్మీ, అంగన్వాడీలు రమాదేవి, వరలక్ష్మి, సువర్ణ, ఆశా కార్యకర్తలు నాగరత్నమ్మ, శివలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

గుమ్మఘట్ట : మండల కేంద్రంలోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని జడ్పీటీసీ మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భవాని, సర్పంచులు విజయలక్ష్మి, రాజేష్, ఎంపిటిసిలు భీమక్క, గోవిందు, నాయకులు చిత్ర శేఖర్, రాజు, ఖాజా హుస్సేన్, ఆనంతరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, డీలర్ తిమ్మప్ప. తదితరులు పాల్గొన్నారు.

ఒఆర్ఎస్ నీటిపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని కర్ణపుడికి గ్రామంలో ఒఆర్ఎస్ నీటిని తాగడం వల్ల కలిగే ఉపయోగాలపై కొత్తూరు ప్రాథమిక వైద్యశాల సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపీహెచ్ఒ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలో పనిచేసే వారు నీటిని తాగడం వల్ల వడదెబ్బకు గురికాకుండా ఉంటారన్నారు. అదేవిధంగా శరీరంలో నీటి శాతం కూడా తగ్గకుండా ఉంటుందన్నారు. అనంతరం ఎంపిపి నాగేశ్వరరావు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

నార్పలకు చేరిన విత్తనకాయలు

విత్తనకాయలను పరిశీలిస్తున్న అధికారులు

నార్పల : ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనకాయలు శుక్రవారం మండల కేంద్రంలోని 1, 3 రైతు భరోసా కేంద్రాలకు చేరుకున్నాయి. దీంతో వ్యవసాయ అధికారి ముస్తఫా విత్తనకాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర ఎకరం ఉన్న రైతుకు ఒక బస్తా, ఎకరా పొలం ఉన్న రైతులకు రెండు బస్తాలు, ఎకరా దాటి పొలం ఉన్న రైతులకు మూడు బస్తాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు

అనంతపురం : టెన్త్‌లో 550పైన, ఇంటర్‌లో 900పైన మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు ఇతర వివరాలకు రైల్వేస్టేషన్ ఎదురుగా ఇండియన్ బ్యాంక్‌పై ఉన్న రెడ్డిసంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్ణారెడ్డి, మధుసూదనరెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిటకే ఎరువులు, విత్తనాలు



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం : రైతుల ముంగిటకే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తామని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక అనంత కృషి భవన్‌లో ఛైర్మన్ ఆలమూరు సబ్బారెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖరీఫ్-2023లో వేరుశనగ విత్తన పంపిణీపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వేరుశనగ విత్తన ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. క్వింటా వేరుశనగ పూర్తి ధర రూ.9,300 కాగా ప్రభుత్వం సబ్సిడీ పోగా రైతు రూ.5,580 చెల్లించాలన్నారు. అయితే ప్రతి విత్తన కాయల కోసం తప్పనిసరిగా ఆయా ఆర్‌బికెల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, ఉద్యాన అధికారిణి చందన, ఎఇఒ ప్రసాద్, మురళి, శిరీషా, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి సురేష్‌కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మంత్రి సురేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

జిల్లావ్యాప్తంగా మున్సిపల్, పట్టణాల్లోని పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు కోరారు. ఈమేరకు సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా పర్యటనకు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వంటివి అమలు కావడం లేదన్నారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, యూనిఫామ్, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, జనాభాకి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు, హెల్త్ అలవెన్స్, రిస్కు అలవెన్స్‌లు అమలు చేయాలన్నారు. ఆప్కాస్ వచ్చినప్పటి నుంచి మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తోందని, దీన్ని సవరించి కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా చూడాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కార్మికులను తన వ్యక్తిగ కారణాలకు వాడుకుంటున్న రాయదుర్గం శానిటరీ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికితోడు మున్సిపల్ ఆర్‌డి పివివిఎస్ మూర్తి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కూడా కలుగజేసుకుని జిల్లావ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి బత్తల ఆదినారాయణ, సహాయ కార్యదర్శి లక్ష్మీనరసమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే.తిరుమలేశు, కమిటీ సభ్యులు బంగ్లా రాఘవేంద్ర, జ్యోతి, మరియమ్మ, మంజుల, కృపమ్మ, అలివేలమ్మ, గంగమ్మ, జయరాం, ఇంజినీరింగ్ సెక్షన్ కమిటీ సభ్యులు మురళి, ఎంఆర్‌పిఎస్ నాయకులు ముత్తురాజ్, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి

నర్సుల దినోత్సవంలో వైద్యాధికారులు వెంకటేష్, పావని

ప్రజాశక్తి-ఉరవకొండ

గుత్తిలో కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న వైద్యుతు, నర్సులు

ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యమనివైద్యాధికారులు వెంకటేష్, పావని అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్‌కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలకు గుర్తుగా ఆమె పుట్టినరోజు మే 12న ప్రతి సంవత్సరం అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు సరస్వతి, సునీత, భవాని, భారతి, రూప, హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఫార్మాసిస్ట్ సరళ, ఎఎన్ఎంలు పద్మావతి, సలీమా, లలిత, కోమల, చాముండేశ్వరి, సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, శ్రీధర్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాముడు, డాక్టర్ సురేఖ, హెడ్ నర్స్ నాగమణి, స్టాఫ్ నర్సులు వరలక్ష్మి, జ్యోత్స్న, తస్లీమ్, సురేఖ, సునీత, శశికళ, అనిత, శ్యామల, విమల, మహమ్మది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మానాయక్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలంలో కొళాయిల వద్ద శుభ్రం చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించి దోమలను పారదోలుదామని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మానాయక్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య, మలేరియా శాఖల అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని రాయంపల్లి, నెరమెట్ల గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందితోపాటు ప్రజలకు డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణలో భాగంగా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, జపనీస్ ఎన్సెఫలైటిస్ వ్యాధులను నివారించడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో పనికిరాని, పగిలిపోయిన, వాడని వస్తువులు, తాగేసిన కొబ్బరి బోండాలు, టీ కప్పులు, పాత టైర్లు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హనుమంతురెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు నిమ్మల వెంకటేసులు, లలిత, సలీమాబేగం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ రూప, నాగ సురేఖ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో జిల్లా వైద్య ఆరోగ్య, మలేరియా శాఖల అధికారుల ఆదేశాల మేరకు మండలవ్యాప్తంగా శుక్రవారం ఫ్రైడే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు.



పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బెలుగుప్ప మండల అధ్యక్షులు కాసంశెట్టి సుధీర్

జనసేనాని దృష్టికి పలు సమస్యలు

బెలుగుప్ప మండలాధ్యక్షులు సుధీర్

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలోని పలు సమస్యలను జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు కాసంశెట్టి సుధీర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం మంగళగిరిలో నిర్వహించిన మండల అధ్యక్షుల సమావేశంలో పవన్‌కళ్యాణ్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపల్లి ముంపు ప్రాంతవాసులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.82 కోట్లు విడుదల చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. అలాగే మండలంలోని దుద్దేకుంట దగ్గరలో ఉన్న కాలువ తవ్వి బ్రిడ్జి పనులు చేయకపోవడంతో తాత్కాలిక మార్గంలో ప్రయానం ఆగమ్యగోచరంగా ఉందన్నారు. అలాగే బెలుగుప్ప-కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో విరుపాపల్లి దగ్గర కూడా ఇలాంటి బ్రిడ్జి పనే ఉందన్నారు. ఆయా బ్రిడ్జిల వద్ద ప్రమాదాలు జరిగి ఇప్పటికే పలువురు చనిపోయారని గుర్తు చేశారు. వీటితోపాటు పలు సమస్యలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రాయదుర్గం సిఐగా లక్ష్మణ్

రాయదుర్గం : రాయదుర్గం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా లక్ష్మణ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఇన్స్‌పెక్టర్ సస్పెండ్ కావడంతో రూరల్ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న యుగంధర్ అదనపు బాధ్యతలు నిర్వహించేరు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్‌ను నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు.

గుత్తి సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

డీఐజీ కె.రాజేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును జైళ్ల శాఖ కడప రేంజ్ డీఐజీ కె.రాజేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జైలులోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం రిమాండ్ ఖైదీల గదుల్లోని మౌలిక సదుపాయాల గురించి ఖైదీలను అడిగారు. క్షణికావేశంలో నేరాలు చేస్తూ జైలుకు వస్తున్నారని నేర జీవితాన్ని వదిలేసి ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక జైలు సూపరింటెండెంట్ వడ్డే మహేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

అధికారం మళ్లీ మాదే : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

రాజకీయంగా ఎంతమంది ఏకమైనా రానున్న ఎన్నికల్లో వైసిపి తప్పకుండా మళ్లీ విజయం సాధించి అధికారం చేపడుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని 6వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పవన్‌కళ్యాణ్ వెంట లేరని తెలిసే ఆఖరి ప్రయత్నంగా పొత్తుల ప్రస్తావన తెస్తున్నారన్నారు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యరంగాల్లో సమూల మార్పులు తెచ్చామన్నారు. టిడిపికి ప్రజలు అవకాశం ఇస్తే సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసి నాయకుల సంక్షేమాన్ని చూసుకున్నారన్నారు. దీంతో విసుగుచెంది జగన్‌కు అధికారం ఇచ్చారన్నారు. ఇకపోతే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పొత్తు అనేది అధికారం కోసం మాత్రమేనని, వాళ్లకు ప్రజా సంక్షేమం పట్టదని విమర్శించారు. ఎంతమంది ఏకమైనా ప్రజల మనసును మాత్రం మార్చలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, టూరిజం డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి, బీసీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, కొర్రపాడు హుసేన్‌పీరా, జెసిఎస్ కన్వీనర్ ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ కన్వీనర్ యోగి, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన పృథ్వీ

రాయదుర్గం : పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఓఇంట్లో నివాసం ఉంటున్న పృథ్వీ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పృథ్వీ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణం తెలియలేదు.

రేషన్ బియ్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

శింగనమల : మండం కేంద్రం సమీపంలోని రామకృష్ణారెడ్డి వ్యవసాయ తోటలో నిల్వ ఉంచిన 172 రేషన్ బియ్యం ప్యాకెట్లను విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నట్లు సిఎస్‌డిటి రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు వ్యవసాయ తోటలో నిల్వ ఉంచినట్లు తెలుసుకుని శుక్రవారం తెల్లవారుజాము విజిలెన్స్ సిఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి నిల్వ ఉంచి 84 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శింగనమల పోలీస్‌స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. అక్కడి నుంచి గోడౌన్‌కు పంపామన్నారు. బత్తలపల్లి మండలం చెర్లోపల్లికి చెందిన కృష్ణమూర్తి ప్రజలతో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఇక్కడ నిల్వ ఉంచి కర్ణాటక బంగారు పేటకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఎస్‌డిటి తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

మృతిచెందిన గొర్రెలు

రాయదుర్గం : పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన నాయకుల తిప్పేస్వామికి చెందిన పది గొర్రెలు శుక్రవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. తిప్పేస్వామి తన గొర్రెలు ఉంచిన పాక చుట్టూ ఇనుప తీగ కంచె ఏర్పాటు చేశాడు. ఈనేపథ్యంలో ఆ కంచెపై ఉంచిన విద్యుత్ తీగల కారణంగా కంచెకు విద్యుత్ సరఫరా అయింది. దీంతో విద్యుదాఘానానికి గురై పది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో దాదాపు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పేకాట జూదరులు అరెస్టు

గార్లదిన్నె : మండల పరిధిలోని పాపినేపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం ఓ తోట దగ్గర పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్నట్లు తెలుసుకుని సిబ్బందితో వెళ్లి దాడి చేయగా 9 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.9,773 స్వాధీనం చేసుకున్నామన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కేకే అగ్రహారం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్నట్లు తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి రూ.4500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలు

గాయపడిన కళ్యాణ్

తాడిపత్రి రూరల్ : విద్యుత్ తీగలు తగిలి ఓ బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన శుక్రవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామం వద్ద ఉన్న బంజారా పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అయ్యవారిపల్లికి చెందిన కంబగిరి, నాగేంద్రమ్మకు కుమారుడు కళ్యాణ్ ఉన్నాడు. తండ్రి చనిపోవడంతో తల్లి నాగేంద్రమ్మ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈనేపథ్యంలో తల్లికి తోడుగా కళ్యాణ్ కూడా బంజారా పరిశ్రమ పరిసరాల్లో వాడిపడేసిన చిన్న చిన్న వస్తువులు ఏరుకుంటూ విక్రయించుకునేవాడు. ఇందులో భాగంగాపే వస్తువులను ఏరుకుంటుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నార్పల ఎస్ఐగా రాజశేఖర్ రెడ్డి

నార్పల : మండల నూతన ఎస్ఐగా రాజశేఖర్‌రెడ్డిని నియమించినట్లు సమాచారం. పెద్దవడుగూరు ఎస్ఐగా పని చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై నార్పలకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పని చేస్తున్న రాఘవరెడ్డిని విఆర్‌కు వేసిన విషయం తెలిసిందే.

రెజ్లర్లను వేధించిన ఎంపీపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

దేశ కీర్తి ప్రతిష్టలు నిలిపిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు వేధించిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు పార్వతమ్మ, ఎఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా కార్యదర్శి కోటేష్ మాట్లాడుతూ దేశానికి స్వర్ణ పతకాలు తెచ్చిన రెజ్లర్లను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపి బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు 20 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆయేషా, సుజాతమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదుపై కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండా గ్రామానికి చెందిన బామ్లానాయక్‌పై సెబ్ అధికారులు అక్రమంగా నమోదు చేసిన పీడీ యాక్ట్‌ను నిరసిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శుక్రవారం రెండో రోజు కూడా ఆందోళన కొనసాగించారు. ముందుగా పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి గాంధీ కూడలిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.50 వేలు ఇవ్వలేదనే సెబ్ సీఐ వరలక్ష్మి బామ్లానాయక్‌పై అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేసిందని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే ఎసిబి అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు, బి.రామకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్ తరలించారు.